## ఆస్కార్ కమిటీలో రాజమౌళి దంపతులు



తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి. 'ఆర్ఆర్ఆర్'తో తెలుగు సినిమాను ఆస్కార్ స్థాయికి తీసుకెళ్లారాయన. దర్శకుడిగా రాజమౌళి సాధించిన ఘనత అసామాన్యం. ఇప్పుడు ఆయనతోపాటు ఆయన సతీమణి రమా రాజమౌళి కూడా ఓ ఘనతను సాధించారు. ప్రతిష్టాత్మక ఆస్కార్ అకాడమీలో చేరేందుకు ఈ జంటకు ఆహ్వానం అందింది. దర్శకుల కేటగిరిలో రాజమౌళి, కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా రమా రాజమౌళి ఈ గౌరవం దక్కించుకున్నారు. ఈ ఏడాది 57 దేశాలనుంచి 487మందికి ఆస్కార్ అకాడమీ ఆహ్వానాలు పంపగా, మన దేశం నుంచి ఈ జంటతో పాటు షబానా ఆజ్మి, రితేశ్ సిద్వానీ, రవివర్మన్ తదితరులు ఈ అహ్వానం అందుకున్నవారిలో ఉన్నారు. ఈ విషయాన్ని ఆస్కార్ అకాడమి తెలియజేస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతులైన కళాకారులకు ఆహ్వానం పలకడం పట్ల అకాడమి ఆనందం వెలిబుచ్చింది. ఇప్పటికే ఈ గౌరవాన్ని దక్కించుకున్నవారిలో తారక్, రామ్‌చరణ్, సంగీత దర్శకుడు కీరవాణి, చాయాగ్రహకుడు సెంథిల్‌కుమార్ ఉన్నారు.

## డబుల్ ఇస్మార్ట్ కౌంట్‌డౌన్ షురూ



రామ్ పోతినేని కథానాయకుడిగా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్‌శంకర్' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఆ సినిమాకు సీక్వెల్‌గా రెట్టింపు వినోదంతో 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్ట్ 15న పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. విడుదలకు ఇంకా 50రోజుల సమయమే ఉన్నందున కౌంట్‌డౌన్ చెబుతూ మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్‌ని విడుదల చేశారు. నాటి 'ఇస్మార్ట్‌శంకర్'ని తలపిస్తూ.. డబుల్ జోష్‌ని ప్రేక్షకులకు అందించేలా రామ్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. కథ, కథనాలతోపాటు పాత్రల తీరుతెన్నులు ఇందులో కొత్తగా ఉంటాయని, ఎక్సయిట్మెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ రెండూ సమపాళ్లలో ఉండే ఈ కథలో సంజయ్‌దత్ పాత్ర చాలా కీలకమని, రామ్‌తో ఆయన కాంబినేషన్ సీన్స్ మాస్‌ని విపరీతంగా ఆకట్టుకుంటాయని మేకర్స్ చెబుతున్నారు. కావ్య థాపర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అలీ, గెటప్ శీను ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సామ్ కె.నాయుడు, జియాని జియానెలి, సంగీతం: మణిశర్మ. పూరీజగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో చార్మీకౌర్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



## వివాదానికి ముగింపు

కొన్నిసార్లు మన ప్రమేయం ఏమాత్రం లేకుండా జరిగిన సంఘటనల వల్ల కూడా అపవాదును మూటగట్టుకోవాల్సి వస్తుంది. అగ్ర హీరో నాగార్జునకు ఇటీవల అలాంటి పరిస్థితే ఎదురైంది. కొద్దిరోజుల క్రితం ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో ఓ దివ్యాంగుడైన అభిమాని నాగార్జునను కలవడానికి ప్రయత్నించగా ఆయన సెక్యూరిటీ గార్డ్ అతన్ని పక్కను తోసివేశారు. ఈ విషయాన్ని గమనించని నాగార్జున ఎయిర్‌పోర్ట్ బయటకు వచ్చేశాడు. అయితే అభిమానిని సెక్యూరిటీ గార్డ్ పక్కని తోసివేస్తున్న వీడియోను ఓ వ్యక్తి సోషల్‌మీడియాలో పోస్ట్ చేయగా అది వైరల్ అయింది. 'ఇదేనా మానవత్వం' అనే క్యాప్షన్‌తో పెట్టిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు నెటిజన్లు ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ ఇన్సిడెంట్ గురించి తెలుసుకున్న నాగార్జున తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా ఆ అభిమానికి క్షమాపణ చెప్పాడు. తనకు తెలియకుండా ఈ సంఘటన జరిగిందని, మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటానని పేర్కొన్నారు. గురువారం ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో ఆ అభిమానిని నాగార్జున ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఆప్యాయంగా హత్తుకొని ఫొటోలు దిగారు. ప్రస్తుతం ఈ వీడియోను నాగ్ ఫ్యాన్స్ సోషల్‌మీడియాలో షేర్ చేస్తూ ..ఏమాత్రం భేషజాలు లేని రియల్ హీరో నాగార్జున అంటూ కొనియాడుతున్నారు. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడ్డట్లయింది.



## లక్కీ ఛాన్స్ కొట్టేసింది

నాగార్జున 'నాసామిరంగ'తో తెలుగు ప్రేక్షకుల మనసుల్ని దోచేసింది కన్నడ కస్తూరి ఆషికా రంగనాథ్. అయితే.. అవకాశాలు మాత్రం ఈ ముద్దుగుమ్మకు అనుకున్న స్థాయిలో రాలేదనే చెప్పాలి. ప్రస్తుతానికి తెలుగులో చిరంజీవి 'విశ్వంభర'లో కీలక పాత్ర పోషిస్తున్నదని సమాచారం. ఇదిలావుంటే.. ఇతర భాషల్లో అషికాకు అవకాశాలు బాగానే ఉన్నాయి. కన్నడలో రెండు మూడు సినిమాలు చేస్తున్న ఈ అందాలభామ.. తాజాగా తమిళంలో ఓ భారీ ఆఫర్‌ని దక్కించుకుంది. ఆ సినిమానే 'సర్దార్ 2'. కార్తీ కథానాయకుడిగా రూపొందిన 'సర్దార్' తమిళనాట భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్‌గా 'సర్దార్ 2'ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు పీఎస్ మిత్రన్. ఇందులో హీరోయిన్‌గా నటించే ఛాన్స్‌ను కొట్టేసింది అషికా రంగనాథ్. అంతేకాక, సిద్ధార్థ్ హీరోగా నటిస్తున్న 'మిస్ యు' సినిమాలో కూడా నటిస్తున్నది అషికా. ఇవి విజయాలు సాధిస్తే కోలీవుడ్‌లో ఈ అందాలభామకు మంచిరోజులొచ్చినట్టే.



## నమ్మశక్యంగాని రూపం

ప్రతిష్టాత్మక పాన్ వరల్డ్ మూవీ 'కల్కి 2898 ఏడీ' గురువారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ప్రధాన తారాగణానికి చెందిన వివిధ పోస్టర్లు, వీడియో గ్లింప్స్, టీజర్లు, ట్రైలర్లు సినిమాపై అంచనాలను ఆకాశమంత ఎత్తులో నిలబెట్టాయి. సినిమా కొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా, విడుదలకు ముందు లాస్ట్ పంచ్ అన్నట్టు.. కమల్‌హాసన్ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ లుక్‌లో సుప్రీం యాస్కిన్‌గా కమల్ నమ్మశక్యంగాని రూపం.. చూసేవారికి ఆశ్చర్యానికి లోనుచేస్తున్నది. మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో కమల్ కనిపిస్తున్నారు. ఇక ఈ సినిమాలో ద్రోణసుతుడైన అశ్వత్థామగా అమితాబ్ నటించిన విషయం తెలిసిందే. 39ఏళ్ల తర్వాత అమితాబ్, కమల్ కలిసి నటించిన సినిమా ఇదే కావడం గమనార్హం. వీరిద్దరు 1985లో 'గిరఫ్తార్' సినిమాలో అన్నదమ్ములుగా నటించారు. మళ్లీ ఇన్నాళ్లకు ఈ మైథలాజికల్ సైన్స్‌ఫిక్షన్ 'కల్కి 2898ఏడీ' కోసం కలిశారు. మళ్లీ ఈ లెజెండ్స్‌ని ఒకే స్క్రీన్‌పై చూసేందుకు ఆడియన్స్ ఆతృతగా ఆసక్తితో ఎదురు చూస్తున్నారనడంలో సందేహం లేదు. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకొనే, దిశాపటానీ కథానాయికలు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించిన విషయం తెలిసిందే.

## పీరియాడిక్ కథతో మట్కా



దేశాన్ని కదిలించిన యధార్థ సంఘటనల ఆధారంగా దర్శకుడు కరుణకుమార్ తెరకెక్కిస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ 'మట్కా'. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ నటుడిగా ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వరుణ్‌తేజ్ ఇందులో మరపురాని పాత్రను పోషిస్తున్నారని కరుణకుమార్ చెబుతున్నారు. వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మూడో షెడ్యూల్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆర్ఎఫ్‌సీలో జరుగుతున్నది. 35రోజుల పాటు సుదీర్ఘంగా జరిగే ఈ భారీ షెడ్యూల్‌కోసం 15కోట్ల బడ్జెట్‌ని నిర్మాతలు కేటాయించారని, పాతకాలంనాటి వైజాగ్‌ని తలపించేలా ఆర్ఎఫ్‌సీలో నిర్మించిన మ్యాసీవ్ సెట్‌లో ఈ షెడ్యూల్ జరుగుతుందని దర్శకుడు తెలిపారు. గ్రాండియర్‌గా సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. బాలీవుడ్ నటి నోరా ఫతేహి కీలక పాత్రధారి. ఇంకా నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్, కన్నడ కిశోర్, తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఏ.కిశోర్‌కుమార్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్.



## సంబరాల ఏటి గట్టు

యువ హీరో సాయిధరమ్‌తేజ్ ఇటీవలే తన కొత్త చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. రోహిత్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమా షూటింగ్ ఈ మధ్యే మొదలైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో శివారులో వేసిన భారీ సెట్స్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. 1947 నేపథ్యంలో పీరియాడిక్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఐశ్వర్యలక్ష్మీని కథానాయికగా ఎంపిక చేశారు. తాజాగా ఈ చిత్రానికి 'సంబరాల ఏటి గట్టు' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కథానుగుణంగా అదే టైటిల్ పక్కాగా సరిపోతుందనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. అయితే ఈ విషయంలో చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై 'హను-మాన్' ఫేమ్ ప్రొడ్యూసర్ నిరంజన్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.



## మారేడిమిల్లి అడవుల్లో స్వయంభూ..

లెజెండరీ వారియర్‌గా నిఖిల్ నటిస్తున్న భారీ పీరియాడికల్ ఫిల్మ్ 'స్వయంభూ'. భరత్‌కృష్ణమాచారి దర్శకుడు. భువన్, శ్రీకర్ నిర్మాతలు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ మారేడుమిల్లిలోని అందమైన లొకేషన్స్‌లో మొదలైంది. అక్కడి దట్టమైన అడవులలో నిఖిల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కథలో ఈ సన్నివేశాలు చాలా కీలకమని మేకర్స్ చెబుతున్నారు. ఇది నిఖిల్ 20వ సినిమా కావడం విశేషం. ఎంతో అంకితభావంతో నిఖిల్ ఈ పాత్రను పోషిస్తున్నారని, ఈ పాత్రకోసం యుద్ధవిద్యల్లో ప్రావీణ్యత కూడా సాధించారని, ఇందులో నిఖిల్ డైనమిక్ పెర్ఫార్మెన్స్‌ని చూస్తారని, వెండితెరపై అద్భుతమైన అనుభూతికి లోనుచేసే సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. సంయుక్తమీనన్, నభా నటేశ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కె.కె.సెంథిల్‌కుమార్, సంగీతం: రవి బస్రూర్, సమర్పణ: ఠాగూర్ మధు, నిర్మాణం: పిక్సెల్ స్టూడియోస్.



## నా కష్టానికి తగ్గ ఫలితమే ఈ విజయం

హీరోయిన్‌గా కొనసాగాలంటే క్వాలిఫికేషన్ కేవలం నటన మాత్రమే కాదు.. అందం, నాజూకైన శరీరం కూడా. ఈ రెండు లేకపోతే హీరోయిన్‌గా ఎక్కువకాలం మనలేరు. ప్రస్తుతం ట్రెండ్ అలా ఉంది. అందుకే కథానాయికలు గంటల తరబడి జిమ్ముల్లోనే కాలం గడిపేస్తుంటారు. పాత్ర కోసం బరువు పెరగాల్సొస్తే.. ఇప్పటి హీరోయన్లకు అది నిజంగా సాహసమే. అవసరమైతే సినిమానైనా రిజక్ట్ చేస్తారుగానీ, కష్టపడి కరిగించుకున్న శరీరాన్ని మాత్రం పెంచుకోరు. కానీ కొందరుంటారు. పాత్రల కోసమే బతుకుతుంటారు. దానికోసం ఎంతటి సాహసాన్నైనా చేస్తారు. ఆకోవలోకే వస్తుంది పరిణితి చోప్రా. ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'అమర్‌సింగ్ చంకీల' సినిమాకోసం ఏకంగా 16 కేజీలు బరువు పెరిగింది పరిణితి. ఈ సినిమా విజయానందంలో ఉన్న ఆమె తాజా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'కెరీర్ మొదట్లో సరైన కథలు ఎంచుకోలేకపోయా. ప్రేక్షకులు నానుంచి వైవిధ్యాన్ని కోరుకుంటున్నారని తర్వాత అర్థమైంది. అందుకే సవాళ్లతో కూడిన పాత్రలను ఎంచుకోవడం మొదలుపెట్టా. 'అమర్‌సింగ్ చంకీల'కోసం 16కేజీలు బరువు పెరిగా. ఈ రోజుల్లో ఇలాంటి సాహసం చేసే కథానాయికలు తక్కువమందే ఉంటారు. ఇందులో గాయని అమర్‌జోత్ కౌర్‌గా నటించాను. ఆ పాత్ర కోసం లైవ్‌లో ఎలా పాడాలో రెండేళ్లు శిక్షణ తీసుకున్నా. నా కష్టానికి తగ్గ ఫలితమే ఈ విజయం' అంటూ ఆనందం వెలిబుచ్చింది పరిణితి.

